# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, వెనిజులా దేశాల మధ్య సన్నిహిత సహకారం గ్లోబల్ సౌత్‌కు ఆవశ్యకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ఈశాన్య భారతదేశ ప్రాంతం నేడు అభివృద్ధి అవకాశాలకు కేంద్రంగా మారిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ అహ్మదాబాద్ వేదికగా మొట్టమొదటి ప్రపంచ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ ఈరోజు ప్రారంభమయ్యింది.
- ❖ నైరుతి రుతుపవనాలు కేరళం అంతటా ఈరోజు విస్తరించాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, వెనిజులా దేశాల మధ్య సన్నిహిత సహకారం గ్లోబల్ సౌత్‌కు ఆవశ్యకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగె తో ఆయన న్యూఢిల్లీలో ఈరోజు చర్చలు జరిపారు. ఇంధనం వాణిజ్యం, పెట్టుబడులు, ఆరోగ్య సంరక్షణ, ఆటోమొబైల్స్ వంటి పలు రంగాలలో కొత్త సహకార అవకాశాల గురించి చర్చించారు. ఈ చర్చల అనంతరం విదేశాంగ మంత్రిత్వ శాఖ సెక్రటరీ (ఈస్ట్) రుద్రేంద్ర టాండన్ మీడియాతో మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు ఉన్న దేశాలలో వెనిజులా ఒకటి అని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఇంధన భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడంపైనే చర్చలు ప్రధానంగా సాగాయని చెప్పారు. భారతదేశాన్ని ఒక స్థిరమైన కొనుగోలుదారుగా వెనిజులా భావిస్తోందని, భాగస్వామ్యంతో పాటు ఇతర రంగాలలో కూడా ఆర్థిక బంధాన్ని విస్తరించడంపై చర్చలు జరిగాయని టాండన్ తెలిపారు. పశుసంవర్ధకం, రవాణా, వ్యవసాయ పరికరాలు, ఆటోమోటివ్ రంగం, ఫార్మాస్యూటికల్స్ తో పాటు మైనింగ్ వంటి రంగాలలో సహకారంపై ఇరు పక్షాలు చర్చలు జరిపాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మొట్టమొదటి ప్రపంచ యోగాసన స్పోర్ట్ ఛాంపియన్‌షిప్ ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈరోజు ప్రారంభించారు. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న ఈ యోగా ఛాంపియన్ షిప్‌ను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అహ్మదాబాద్ గడ్డ పై నుండి, ప్రపంచ క్రీడా చరిత్రలో మరో నూతన అధ్యాయం నేడు ప్రారంభమయిందన్నారు. యోగా భవిషత్‌లో అంతర్జాతీయ క్రీడల్లో స్థానాన్ని సంపాదించుకుంటుందన్నారు. ఒలింపిక్స్ మొదలుకొని ఏ క్రీడా పోటీల్లోనైనా ఎంత ఎక్కువ కష్టపడితే అంత మంచి ఫలితాలు సాధించగలమని పేర్కొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన వివిధ దేశాల క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

5 రోజుల పాటు జరిగే ఈ ఛాంపియన్ షిప్‌కు అమెరికా, జపాన్, నెదర్లాండ్స్, ఒమన్, మారిషస్, ఉగాండా మొదలగు 70 కి పైగా దేశాల నుండి 500 మందికి పైగా అథ్లెట్లు పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య భారతదేశ ప్రాంతం నేడు అభివృద్ధి అవకాశాలకు కేంద్రంగా మారిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. షిల్లాంగ్లో ఈరోజు జరిగిన ఈశాన్య ప్రాంత జోన్ 73వ ప్లీనరీ సమావేశంలో అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈశాన్య ప్రాంతాలలో హింసకు ముగింపు పలికిందని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ.. స్థానిక సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. ఈశాన్య ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నాయకులందరూ కృషి చేస్తున్నారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, సహజ వాయువు నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని పెట్రోలియం-సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ న్యూ ఢిల్లీలో జరిగిన అంతర మంత్రిత్వ మీడియా సమావేశంలో తెలిపారు. ఎక్కడా ఎల్పీజీ పంపిణీలో కొరత లేదని ఆమె స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ఎల్పీజీ సిలిండర్ బుకింగ్‌లు 99 శాతానికి పెరిగాయని, ఓటీపీ ఆధారిత డెలివరీలు 96 శాతానికి పైగా నమోదవుతున్నాయని చెప్పారు.

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోనే మొట్టమొదటి మారుతి సుజుకి ఫ్లెక్స్-ఫ్యూయల్ ప్యాసింజర్ (ప్రయాణికుల) వాహనాన్ని కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్ పూరి, నితిన్ గడ్కరీలు న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ... ప్రయాణికుల వాహన రంగంలోకి ఫ్లెక్స్-ఫ్యూయల్ సాంకేతికత ప్రవేశించడం అనేది కేవలం ఒక ఉత్పత్తి లాంచ్ మాత్రమే కాదని దేశ ఇంధన పరివర్తనలో ఒక కొత్త అధ్యాయానికి ఆరంభమని చెప్పారు. ఈ సాంకేతికతను పెద్ద ఎత్తున అవలంబించడం వల్ల ఇథనాల్ ఆధారిత రవాణా ప్రభావం గణనీయంగా పెరుగుతుందని చెప్పారు. ఇక నితిన్ గడ్కరీ మాట్లాడుతూ... స్వచ్ఛమైన, స్థిరమైన, స్వయం సమృద్ధి గల రవాణా రంగం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ సాంకేతికతను అభివృద్ధి పరిచామని చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాంకేతికత పాలనను మెరుగుపరచడంలోనూ, సంక్షేమ పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖా మంత్రి కిరెన్ రీజిజు అన్నారు. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ రోజు న్యూ ఢిల్లీ

లో ఏర్పాటు చేసిన 12 సంవత్సరాల రిఫార్మ్స్ ఉత్సవంలో ఆయన మాట్లాడుతూ... సాంకేతికతను అవలంబించడం ద్వారా దేశ వ్యాప్తంగా లబ్ధిదారుల జీవితాల్లో స్పష్టమైన మార్పులు తీసుకొచ్చే అవకాశం మంత్రిత్వ శాఖలకు లభించిందని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గృహ నిర్మాణం, తాగునీరు, విద్యుత్, ఆహార భద్రత, డిజిటల్ కనెక్టివిటీ అందుబాటులో ఉన్న భారతదేశాన్ని సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమని కిరెన్ రీజిజు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ లో రేపు పర్యటిస్తారు. సూరత్ లో 18,800 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అదే విధంగా 200 పడకల ESIC ఆసుపత్రిని కూడా ప్రారంభిస్తారు. ఇక సాయంత్రం డామన్‌కు వెళ్లి అక్కడ 970 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టకు శంకుస్థాపనలు చేస్తారు. డామన్‌లో నమో విమానాశ్రయం, కొత్త టెర్మినల్ భవనంతో సహా సుమారు 1,340 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించి.. దేశానికి అంకితం చేస్తారు. ఈ కొత్త విమానాశ్రయం టెర్మినల్ ప్రాంతీయ విమాన కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరు పరచడంతో పాటూ ఆ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని సులభతరం చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శిలాజ రహిత ఇంధన సామర్థ్యం కలిగిన అగ్రశ్రేణి ఉత్పత్తిదారులలో భారత్ ప్రపంచంలోనే ఒకటిగా ఎదుగుతున్నట్లు కేంద్ర నూతన పునరుత్పాదక ఇందన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈ పథకం విజయవంతం కావడానికి ప్రధాన కారణం దేశ పౌరులు తమ ఇంటి పైకప్పులపై సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోగలరని తద్వారా విద్యుత్ బిల్లు సున్నా అవుతుందని గ్రహించడమే అన్నారు. పీఎం సూర్య ఘర్.. ముఫ్త్ బిజ్లీ యోజన అనేది దేశంలోని గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందించే లక్ష్యంతో కూడిన ప్రభుత్వ పథకమని, దీని కింద గృహాలు తమ పైకప్పులపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడానికి సబ్సిడీ అందించబడుతుందని చెప్పారు. సోలార్ ప్యానెళ్ల ఖర్చులో 40 శాతం వరకు ఈ సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. అంతకుముందు వాట్సాప్ చాట్‌బాట్ “సన్‌తోష్” పీఎం సూర్య ఘర్ లోగోను ప్రహ్లాద్ జోషి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు కేరళం అంతటా ఈరోజు విస్తరించాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దక్షిణ తమిళనాడులో కొన్ని ప్రాంతాలను రుతుపవనాలు తాకాయని ఐఎండీ వెల్లడించింది. వీటి ప్రభావంతో కేరళం, మాహేలలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ శాస్త్రవేత్త త్రిశాను బనిక్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =